# ఇకపై డ్రంక్ అండ్ డ్రైవ్ తరహాలో డ్రగ్ డిటెక్షన్ తనిఖీ

- జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో డ్రగ్ టెస్టింగ్ కిట్స్
- జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు




**జగ్గంపేట, పెన్ పవర్, మే 24:** ఇకపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ మాదిరి ప్రతిరోజు జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలో డ్రగ్ డిటెక్షన్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే మన లక్ష్యం అన్నారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు నిరంతరం డ్రగ్ డిటెక్షన్ తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు, వ్యక్తులపై డ్రగ్ డిటెక్షన్ తనిఖీ తప్పనిసరిగా జరుగుతుందన్నారు. జగ్గంపేట పోలీస్ స్టేషన్లో డ్రగ్ టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉన్నాయని ఎవరైనా అనుమానితంగా ఉంటే ఆ కిట్ల ద్వారా డ్రగ్స్ వాడారా లేదా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. డ్రగ్స్ వాడటం సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రగ్స్ వాడిన, సరఫరా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని భవిష్యత్తు కోసం ఆలోచించాలని హితవు పలికారు. డ్రగ్స్ సరఫరా వాడకంపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. డ్రగ్స్ వాడకం సరఫరా పై సమాచారం తెలిస్తే ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 112, నార్కోటిక్ హెల్ప్ లైన్ 1972 నెంబర్లను సంప్రదించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తిరుపతిరావు పేర్కొన్నారు.




## జగ్గంపేట పూర్వ విద్యార్థుల కలయిక



**జగ్గంపేట, పెన్ పవర్, మే 24:** జగ్గంపేట ప్రభుత్వ హైస్కూల్లో 2010-11 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న ఆనాటి విద్యార్థులు ఆదివారం జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామ శివారు సింగరమ్మచింతలో కలుసుకున్నారు. సుమారు 15 సంవత్సరాలు తర్వాత కలిసిన వారంతా ఒకరినొకరు పలకరించుకుని ప్రస్తుతం తాము చేసే ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ పరిస్థితులపై మాట్లాడుకున్నారు. సాయంత్రం వరకు ఆటలాడుకున్నారు. తాము చదువుకున్నప్పటి గుర్తులు నెమరు వేసుకున్నారు. ఫోటోలు తీసుకుని సందడి చేశారు. అందరూ సహపంక్తి భోజనాలు చేశారు. మళ్లీ గెట్ టు గెదర్ పెద్ద ఎత్తున పెట్టుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా కౌడా చైర్మన్‌గా తలాటం సత్య ప్రమాణ స్వీకారం





- “నేను కూడా ఒకప్పుడు చివరి లైన్లో ఉన్న జనసేన కార్యకర్తనే”
- భావోద్వేగ ప్రసంగం
- కూటమి నేతలు, మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘన కార్యక్రమం

**కాకినాడ పెన్ పవర్ ప్రతినిధి,మే 24 పెన్ పవర్:**
కాకినాడ గోదావరి కళాక్షేత్రం ఆదివారం రాజకీయ, సాంస్కృతిక వేడుకలకు వేదికగా మారింది. కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కౌడా) చైర్మన్‌గా తలాటం నాగ వెంకట సత్యనారాయణ (సత్య) అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జనసేన-కూటమి నాయకులు, అభిమానుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

జాయింట్ కలెక్టర్స్ అపూర్వ భరత్ సమక్షంలో తలాటం సత్య ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు వేదికపై పాల్గొన్నారు.

“భారత రాజ్యాంగాన్ని నిష్పక్షపాతంగా, నిబద్ధతతో పాటిస్తూ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కౌడా చైర్మన్ బాధ్యతలను పారదర్శకంగా నిర్వహిస్తాను” అంటూ తలాటం సత్య ప్రమాణం చేశారు.

“సత్య కష్టం వల్లే ఈ పదవి” -- పంతం నానాజీ

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ, తలాటం సత్య జనసేన పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశారని, ఆయన అంకితభావానికి గుర్తింపుగానే ఈ పదవి లభించిందన్నారు.

“పవన్ కళ్యాణ్ గుర్తించిన కష్టానికి ఫలితం” -- ఎంపీ ఉదయ శ్రీనివాస్

ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ, జనసేన కార్యకర్తగా సత్య చేసిన సేవలను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గుర్తించారని తెలిపారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి అంశం అధినేత దృష్టికి వెళ్లిందని, అందుకే ఈ గౌరవం దక్కిందన్నారు.

“కౌడా చైర్మన్ పదవి మంత్రి స్థాయిలోది” -- ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ, కౌడా చైర్మన్ పదవి ఒక మంత్రి స్థాయి హోదా అని పేర్కొన్నారు. ఈ పదవి కోసం ఎంతోమంది ఎదురుచూశారని, చివరకు పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఆశీస్సులతో సత్యకు అవకాశం రావడం ఆనందదాయకమన్నారు.

“పదవి కాదు బాధ్యత” -- తలాటం సత్య

ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో మాట్లాడిన తలాటం సత్య భావోద్వేగానికి గురయ్యారు.

“రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో ఈ బాధ్యత నాకు దక్కింది. ఆయన ఎప్పుడూ ‘ఇది పదవి కాదు, బాధ్యత’ అని చెబుతుంటారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను” అన్నారు.

“నేను కూడా ఒకప్పుడు చివరి లైన్లో కూర్చున్న సాధారణ జనసేన కార్యకర్తనే. కష్టపడితే గుర్తింపు తప్పకుండా వస్తుందని నా జీవితమే ఉదాహరణ” అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

మంత్రులు, నేతల ఘన సత్కారం

మంత్రులు కందుల దుర్గేష్, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ, తుమ్మల బాబు, తోట సుధీర్, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు నూతన చైర్మన్‌ను సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి

ప్రమాణ స్వీకారానికి ముందు ఏవీకే కృష్ణమాచారి సకలవాహిని సంగీత కార్యక్రమం నిర్వహించగా, అనంతరం కూచిపూడి, భరతనాట్యం, కర్రసాము వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

భారీగా తరలివచ్చిన జనసేన శ్రేణులు

ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు, వీర మహిళలు, కూటమి కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై సభ ప్రాంగణాన్ని నింపేశారు. కార్యక్రమంలో తోట సుధీర్, తుమ్మల బాబు, ముత్తా నవీన్, దేగల నాగేంద్ర, దేగల అబ్బు తదితరులు పాల్గొన్నారు.





## బెంతుకుర్తి అబ్బాయి మృతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు.






-ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు.

కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,మే 24: ప్రత్తిపాడు మండలం ధర్మవరం తాజా మాజీ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల భర్త,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బెంతుకుర్తి అబ్బాయి అకాల మృతి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు అన్నారు. ధర్మవరం గ్రామ మాజీ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల భర్త,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెంతుకుర్తి అబ్బాయి ఆదివారం అకాల మృతి చెందారు.విషయం తెలుసుకున్న వెంటనే మురళీకృష్ణంరాజు,సుశీల కుటుంబాన్ని పరామర్శించి అబ్బాయి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అబ్బాయి అంతక్రియల కార్యక్రమంలో పాల్గొని వారి కుటుంబానికి తీవ్ర ప్రగాఢ సానుభూతి తెలియజేసి అబ్బాయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్ధించారు.అబ్బాయి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కోలా తాతబాబు,జువ్వల దొరబాబు,కోన బాబ్జి,తూపాటి బాబ్జి,నాగులపల్లి ఏసు,రాపా అప్పన్న ,పలువురు ముఖ్య నాయకులు,అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు




# గంజాయిపై జగ్గంపేటలో డ్రోన్ కెమెరాతో పోలీసుల నిఘా

**జగ్గంపేట, పెన్ పవర్, మే 24:** గంజాయి వాడకం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలు మేరకు పెద్దాపురం డిఎస్పి ఎబిజీ తిలక్ పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ బి.తిరుపతిరావు, జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు గంజాయి వాడకం, రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచారు. దీనిలో భాగంగా ఆదివారం జగ్గంపేట సీఐ తిరుపతిరావు పర్యవేక్షణలో జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు సిబ్బందితో అనుమానిత ప్రదేశాలలో డ్రోన్ కెమెరాతో నిఘా నిర్వహించారు. జగ్గంపేటలోని పలు గ్రామాలలో డ్రోన్ కెమెరా ద్వారా తనిఖీలు చేపట్టారు. గంజాయి సేవించిన, రవాణా చేసిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన డ్రోన్ కెమెరాకు చిక్కక తప్పదన్నారు. పోలీస్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై రఘునాధరావు హెచ్చరించారు. గంజాయి వాడకం, రవాణాపై సమాచారం తెలిస్తే జగ్గంపేట సీఐ 9440796529, జగ్గంపేట ఎస్సై 9440796569 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని జగ్గంపేట ఎస్సై రఘునాధరావు తెలిపారు.



